వరంగల్ వాయిస్
Evening Daily


సంపుటి : 04 | సంచిక : 329
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
అక్టోబర్ 15, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## వెంకటమ్మకు జర్నలిస్టుల నివాళి



2లో..

# దొంతి కాంతమ్మకు.. ఘననివాళి



వివరాలు2లో..



- మాతృయజ్ఞంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్
- పుష్పాంజలి ఘటించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- పీజీఆర్ గార్డెన్స్‌లో దశదిన కర్మ కార్యక్రమం
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం

నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి కీర్తిశేషులు దొంతి కాంతమ్మ ఇటీవల మరణించిన నేపథ్యంలో హనుమకొండలోని పీజీఆర్ గార్డెన్స్ లో బుధవారం దశదిన కర్మ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మాతృ యజ్ఞంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఆమె చిత్రపటంపై పుష్పాలు జల్లి అంజలి ఘటించారు. దొంతి మాధవ రెడ్డితోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. మాధవరెడ్డి చేయి పట్టుకొని అక్కడినుంచే ఈ కార్యక్రమానికి హాజరైన వారికి అభివాదం చేశారు. అనంతరం సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలను భోజనాల ప్రాంగణానికి తోలుకొని వెళ్లిన మాధవ రెడ్డి వారికి భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు. ఆద్యంతం ఎంతో ఆప్యాయతతో సాగిన ఈ కార్యక్రమంతో ఇంతకాలం రేవంత్ రెడ్డి, మాధవరెడ్డిలకు ఒకరంటే ఒకరికి పడదన్న అభిప్రాయం పటాపంచలైంది. అయితే ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. - వరంగల్ వాయిస్, హనుమకొండ



8లో..

## ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని కాపాడండి

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించండి
- ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి



## డీజీపీని కలినిన బండి సుధాకర్ గౌడ్

రాష్ట్ర డీజీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివధర్ రెడ్డిని బుధవారం హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో టీపీపీసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛాన్ని అందించి అభినందిచారు.
– వరంగల్ వాయిస్, హనుమకొండ



8లో..

## ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో రోడ్ల నిర్మాణం

- సమగ్ర ప్రణాళిక రూపొందించండి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

## కన్న కొడుకు కాదన్నాడు

### ప్రభుత్వానికి మూడు ఎకరాల భూమి అప్పగించిన తండ్రి



కన్న కొడుకు పట్టించుకోవడం లేదనే ఆవేదనతో హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి చెందిన మాజీ ఎంపీపీ గోలి శ్యాంసుందర్ రెడ్డి తన పేరున ఉన్న ఆరు ఎకరాల భూమిలో మూడు ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 14న జిల్లా రెవెన్యూ అధికారుల సమక్షంలో భూమిని అప్పగించే పత్రాలపై ఆయన సంతకం చేశారు. తల్లిదండ్రులను పట్టించుకోని వారసులకు గుణపాఠం చెప్పాలనే ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ భూమిలో తన భార్య జ్ఞాపకార్థం పాఠశాల నిర్మించాలని ఆయన కోరారు. అయితే ఎల్కతుర్తిలో ఎకరం కోటి రూపాయలకు పైగానే ధర పలుకుతోంది.
– వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి







# దొంతి కాంతమ్మకు.. ఘన నివాళి

- మాతృయజ్ఞంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్
- పుష్పాంజలి ఘటించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- పీజీఆర్ గార్డెన్స్ లో దశదిన కర్మ కార్యక్రమం
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని పరామర్శించిన సీఎం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, ఏఐసీసీ సభ్యులు దొంతి మాధవ రెడ్డి తల్లి గారైన దొంతి కాంతమ్మ ఇటీవల మరణించగా, బుధవారం ఆమె స్మారక కార్యక్రమం హనుమకొండ జిల్లా ప్రశాంత్ నగర్ లోని పీజేఆర్ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని దొంతి కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, రఘువీర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

### ఘన స్వాగతం..

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానానికి చేరుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పుష్ప గుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.

### రోడ్డు మార్గంలో పీజీఆర్ గార్డెన్ కు..

ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి రోడ్డు మార్గంలో పీజీఆర్ గార్డెన్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా దొంతి మాధవరెడ్డి మాతృ మూర్తి దొంతి కాంతమ్మ చిత్రపటం వద్దకు చేరుకొని పూలు జల్లి ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాధవ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి అక్కడే భోజనం చేసిన సీఎం, ఇతర మంత్రులు తిరిగి రోడ్డు మార్గంలో ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి హెలీక్యాప్టర్ లో హైదరాబాద్ బయలుదేరారు. వారికి అధికారులు, ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి వరంగల్ పర్యటన నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు.

















## వెంకటమ్మకు జర్నలిస్టుల నివాళి

**వరంగల్ వాయిస్, నడికుడ :** హనుమకొండ జిల్లా నడికుడ మండలం చౌటుపర్తి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కార్యదర్శి తొట సుధాకర్ మాతృమూర్తి తొట వెంకటమ్మ దశదినకర్మ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన జర్నలిస్టులు వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షులు పిన్నా శివకుమార్, గడ్డం కేశవమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, రాష్ట్ర హౌజింగ్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరాం, పోలిశెట్టి విష్ణువర్ధన్, నేతలు కొండం రవీందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రామారావు, భోజ శ్రీనివాస్ రెడ్డి, మహేష్, ఐలయ్య, ఉస్మాన్ పాషా, సంపత్, ప్రభాకర్, తాడూరి గోపి, శ్యాం, సదయ్య, రాంబాబు, రవి, సదానందం, మల్లెపాక సాంబయ్య, ఓదెలు, శ్రీనివాస్, సుధాకర్, రమేష్, చొక్కా రావు, కరుణాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘బీసీ రిజర్వేషన్లు అమలయ్యేదాకా పోరాటం ఆగదు’

**■ తాటిపాముల వెంకట్రాములు**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు జరిపే వరకు తమ పోరాటాలు ఉధృతంగా కొనసాగుతాయని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ అంశాన్ని భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చకుంటే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో సీపీఐ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకో, నిరసన కార్యక్రమంలో వెంకట్రాములు ప్రసంగించారు. శాసనసభలో బీసీ రిజర్వేషన్‌పై ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించి ఆరు నెలలు దాటినా పట్టించుకోకపోవడం బీసీలను అవమానపరచడమేనన్నారు. రాష్ట్రంలోని బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే శక్తి లేకపోతే తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అన్ని రాజకీయ పార్టీల బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ప్రధానమంత్రి, రాష్ట్రపతి దగ్గరికి తీసుకెళ్తానని ఇచ్చిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. జీవో 9పై హైకోర్టులో పిటిషన్ వేసిన రెడ్డి జాగృతికి చెందిన బుట్ట మాధవరెడ్డితో పాటు బీసీ ద్రోహులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బీసీ వ్యతిరేక విధానాలను విడనాడకపోతే వారికి పుట్టగతులు ఉండవని, బీసీలకు, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం లభించే వరకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడి పోరాడుతామని వెంకట్రాములు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి ప్రసంగిస్తూ రాజ్యాధికారం కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలని, బీసీ పోరాటాలకు సీపీఐ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సీపీఐ వరంగల్ జిల్లా నాయకులు దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, గుండె బద్రి, సంగీ ఏలేందర్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వలభోజు వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓర్సు రాజు, సీపీఐ సమితి సభ్యులు ఎండి అక్బర్ పాషా, సుంకరి భవాని, యాకామ్రు చారి, దస్రు, నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు ఈ కేవైసీ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పారదర్శకత పెంచడానికి కేంద్రం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా, జాబ్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ–కేవైసీ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. ఆయా గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు తమకు కేటాయించిన ప్రత్యేక యాప్‌లో కూలీల ఈ–కేవైసీని నమోదు చేస్తున్నారు. మల్హర్ మండలంలో మొత్తం 10,700 జాబ్ కార్డులు ఉండగా, అందులో 21,280 మంది కూలీలు ఉన్నారు. వీరిలో నిత్యం పనులకు వెళ్లే కూలీలు 10,640 మంది. సెప్టెంబర్ 25న ప్రారంభమైన ఈ–కేవైసీ ప్రక్రియ ఇప్పటివరకు మండలంలో 5,500 మంది కూలీలకు పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు. అంటే, సుమారు 50 శాతం ఈ–కేవైసీ ప్రక్రియ పూర్తయింది. బుధవారం క్షేత్ర స్థాయిలో ఈ–కేవైసీ ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఇంచార్జి ఎంపీడీవో శ్రీరామ మూర్తి, ఏపీవో హరీష్ మాట్లాడారు. ఈ–కేవైసీ పూర్తి అయిన కూలీలకు మాత్రమే ఉపాధి పనులు కల్పించబడతాయని వారు స్పష్టం చేశారు. కాబట్టి, జాబ్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఉపాధి కూలీ సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద విధిగా ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలని వారు సూచించారు. త్వరలోనే మండలంలో వంద శాతం ఈ–కేవైసీ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# పశువులకు గాలికుంటు టీకా తప్పనిసరి



**వరంగల్ వాయిస్, రేగొండ :** పశువుల ప్రాణాలకు ముప్పు కలిగించే గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు తమ పశువులకు టీకాలు విధిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక అధికారి డా.ఏ. కుమారస్వామి, ఏడీ టి.గోపాలకృష్ణ మూర్తి రైతులకు సూచించారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఉమ్మడి రేగొండ మండలంలో గల రేగొండ, రంగయ్యపల్లి గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదని, ఇది పశువులకు ఒకదాని నుంచి మరొకదానికి త్వరగా సంక్రమిస్తుందని అన్నారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 14 వరకు నెల రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాలలో పశువులకు, ముఖ్యంగా నాలుగు నెలలు దాటిన దూడలకు ఈ టీకాలను ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. వ్యాధి సోకకముందే టీకాలు వేయించి నివారణ చర్యలు చేపట్టాలని పాడి రైతులకు సూచించారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి దూరంగా ఉంచాలని, లేనట్లయితే అన్ని పశువులకు వ్యాధి సోకి తీవ్ర నష్టం కలుగుతుందని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వం పశువైద్య శాఖ ద్వారా ఉచితంగా టీకాలు వేయిస్తున్నందున, రైతాంగం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా.కుమారస్వామి కోరారు. రేగొండ పశువైద్యాధికారి డా.మైథిలి, రంగయ్యపల్లి పశువైద్యాధికారి అభిషేక్, గోపాల మిత్ర, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు.

# 18న బీసీ రిజర్వేషన్ల కై రాష్ట్ర బంద్



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ, బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న జరగనున్న “రాష్ట్ర బంద్“ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, విద్యావేత్త డా. సిరికొండ శ్రీనివాసాచారి పిలుపునిచ్చారు. డా. శ్రీనివాసాచారి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 9కు తమ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. ఈ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. 30 బీసీ సంఘాల వాదనలు వినకుండా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన తరువాత హైకోర్టు స్టే ఇవ్వడం బీసీలను మోసం చేయడమేనని ఆయన ఆరోపించారు. ఈ రిజర్వేషన్లను సాధించే వరకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన తరహాలో ఉధృతమైన ఉద్యమాలు, పోరాటాలు సాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బీసీల బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు, కులాలు, మతాలకు అతీతంగా స్వచ్ఛందంగా పాటించి, సహకరించి విజయవంతం చేయాలని డా. సిరికొండ శ్రీనివాసాచారి కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర నాయకులు ఎడ్ల సుధాకర్, బసాని సోమరాజుపటేల్, డా. శివదేవ్, సూత్రపు శివాజీగణేష్ నాయి, సూర సతీష్ పటేల్, అల్లం మధుసూదన్ ముదిరాజ్, మహిళా నాయకులు దుంపేటి యశోద, మౌనిక, తూముల అనిత, లక్కం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం



**వరంగల్ వాయిస్, నడికూడ :** భారతరత్న, మిస్సైల్ మెన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నడికూడ మండలంలోని పులిగిల్ల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కటుకోజ్వల సతీష్ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సతీష్ మాట్లాడుతూ కలాం జీవితం నేటి యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలని అన్నారు. ఆయన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థలో (ఇస్రో) ఏరోస్పేస్ ఇంజనీరుగా పనిచేసి, దేశానికి మిస్సైల్ మెన్‌గా పేరుగాంచారని కొనియాడారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఆయన అనేక ప్రణాళికలు రచించారని తెలిపారు. కలాం దేశపు అత్యున్నత పురస్కారం భారతరత్నతో పాటు అనేక అవార్డులను అందుకున్న మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా, ప్రదీప్, నిరోష, రమేష్, అంగన్వాడీ టీచర్లు రాజేశ్వరి, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సుష్మా స్వరాజ్ వల్లే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైంది

**● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు**



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని బుధవారం మానుకోట జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు నరేష్ నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్ష్మీ నారాయణ వ్యాస్, రాయల రాంబాబు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు రెహ్మాన్, మండలాధ్యక్షులు గణేష్ నాయక్ పాల్గొన్నారు. తొలుత ముత్యాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వెంకటేశ్వర్లు, గుడి ముందు పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డోర్నకల్ మండలంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటి పరిష్కారం కేవలం దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న భాజపాతోనే సాధ్యమని అన్నారు. తెలంగాణ చిన్నమ్మ సుష్మా స్వరాజ్ ఇచ్చిన లేఖకు తలొగ్గిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు దారులు వేశారని పేర్కొన్నారు. మోడీ నాయకత్వంలో దేశ ప్రజలు నిర్భయంగా జీవిస్తున్నారని వివరించారు. యువ నాయకుడు నరేష్ నాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనతో విసిగివేసారిన ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే యువకులు బీజేపీ వైపు ఉన్నారని, తమ పార్టీ సైతం యువకులకే ప్రాధాన్యత ఇచ్చి నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా మారుస్తుందని తెలిపారు. డోర్నకల్ మండల ప్రజలు బీజేపీని తప్పక ఆదరించి, అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీలు గుగులోతు మదన్ నాయక్, గడ్డం అశోక్, దేవా నాయక్, బాసాని నాగేష్, సింగారపు సతీష్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

**సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా విద్యార్థులకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. బుధవారం కలాం జయంతిని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విలువలతో కూడిన సాదాసీదా జీవితాన్ని గడిపిన మహా వ్యక్తి అని శ్రీనివాస్ కొనియాడారు. విజ్ఞాన, సాంకేతిక రంగాలలో ఆయన చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, ఐక్యరాజ్యసమితి కలాం జయంతిని ‘విద్యార్థుల దినోత్సవం’గా ప్రకటించడం మనందరికీ గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కలాం ఇచ్చిన స్ఫూర్తిదాయక సందేశాన్ని గుర్తుచేస్తూ, “కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి” అనే మాటలను విద్యార్థులు ఆచరించాలని సూచించారు. కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకున్నట్లయితే విద్యార్థులు జీవితంలో గొప్ప విజయాలు సాధించవచ్చని అన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, అక్టోబర్ 15, 2025

# గాలికుంటు టీకాలతో పశువులకు ఎంతో మేలు

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా పశువైద్య సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం – ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం కింద నిర్వహిస్తున్న ఈ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం రైతులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. పశుసంపద మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిదని, ప్రతి రైతుకు పశువులు కుటుంబ సభ్యుల్లాంటివని, వాటిని రక్షించడం మన బాధ్యతగా భావించాలని కోరారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గాలికుంటు వ్యాధి గురించి హెచ్చరిస్తూ గాలికుంటు (బ్రూసెల్లా) వ్యాధి పశువులకు మాత్రమే కాకుండా, మనిషికి కూడా సోకే అవకాశం ఉందని తెలిపారు. ఈ టీకాల కార్యక్రమం ద్వారా పశువులను రక్షించడం ద్వారా మన కుటుంబాల ఆరోగ్యాన్ని కూడా కాపాడుతున్నామని వివరించారు. హనుమకొండ జిల్లాలో పశువైద్య శాఖ చురుకుగా పనిచేస్తూ, టీకాల పంపిణీలో గొప్ప పనితీరు కనబరుస్తోందని, ముఖ్యంగా రైతులను చైతన్యవంతులను చేసి, పశువుల ఆరోగ్యంపై అవగాహన పెంచడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆయన సూచించారు. పశువుల ఆరోగ్యం అంటే మన ఆరోగ్యం, మన జీవనోపాధి, మన భవిష్యత్తు అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నాగరాజు, డివిజన్ అధ్యక్షులు పున్నంతో పాటు పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులకు సంబంధించి 37 మంది వ్యక్తులను కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ కె. లక్ష్మీనారాయణ వారికి శిక్ష విధించారు. గౌరవ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, అడిషనల్ డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ కేసులను నమోదు చేశారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 37 మంది వ్యక్తుల్లో నలుగురికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. జైలు శిక్ష పడిన ఈ నలుగురిని హుజూరాబాద్ సబ్ జైలుకు పంపించారు. మిగిలిన 33 మంది వ్యక్తులకు కోర్టు మొత్తం రూ. 29,900 జరిమానా విధించింది. మరో ముగ్గురు వ్యక్తులను డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపినందుకు కోర్టులో హాజరు పరచగా, వారికి రూ. 1,500 జరిమానా విధించడం జరిగిందని వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.సుజాత తెలిపారు.

# మానేరుకు తగ్గిన వరద ఉధృతి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని పీవీ నగర్ సమీపంలో ఉన్న మానేరు నదికి వరద ఉధృతి గణనీయంగా తగ్గింది. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో, మానేరు నది గత వారం రోజుల క్రితం వరకు నిండు కుండలా ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. అయితే, అక్టోబర్ నెలలో వర్షాలు తగ్గడంతో మానేరు నదికి వరద ప్రవాహం తగ్గి, ప్రస్తుతం పీవీ నగర్ చెక్ డ్యాం వద్ద సాధారణ స్థాయిలో ప్రవహిస్తోంది. మానేరు నదికి వరద తగ్గడంతో చేపల వేట కోసం మత్స్యకారులు చెక్ డ్యాం వద్ద సిద్ధమవుతున్నారు.

# "విలీన గ్రామాల రైతులకు సాదాబైనామా 2025 చట్టంలో అవకాశం కల్పించాలి"



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనమైన సుమారు 42 గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న తీవ్రమైన భూ సమస్యలపై అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది కలకోటి మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండలం చింతగట్టు క్యాంపులో జరిగిన అసైన్డ్ భూమి సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలకోటి మహేందర్ మాట్లాడుతూ విలీన గ్రామాల రైతులు సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూములు పట్టాలు కాక కొన్ని ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో ధరణి వెబ్ పోర్టల్, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి పోర్టల్లో సైతం ఈ 42 విలీన గ్రామాల భూములు సాదాబైనామా కేసులుగా నమోదై పట్టాలు కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పట్టాలు కాకపోవడం వల్ల రైతులు కొనుగోలు, అమ్మకాలు చేసే పరిస్థితి లేకపోవడంతో పాటు, భూములపై వారికి హక్కులు లేకుండా పోతున్నాయని, దీని ద్వారా సివిల్ డిస్ప్యూట్స్ (పౌర వివాదాలు) పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు చొరవ తీసుకుని, ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాలని కోరారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఆర్.ఓ.ఆర్ చట్టం 2025లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన 42 గ్రామాల రైతులకు సాదాబైనామా ద్వారా పట్టాలు జారీ చేసి, తెలంగాణ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోనే అత్యధిక విలీన గ్రామాలు ఉన్నందున ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు తక్షణమే చర్యలు తీసుకోవాలని 42 గ్రామాల రైతులు ఎదురుచూస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రవీందర్, మాట్ల మురళి, కలకోట్ల పవన్ కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బాలికల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పర్వతగిరి మండలంలోని ఎనుగల్లు ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సంక్షేమ శాఖ అధికారి రాజమణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి మాట్లాడుతూ బాలికల హక్కులను పరిరక్షించడం, వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం, వారికి సమాన హక్కులతో కూడిన సమాజాన్ని నిర్మించడం మనందరి బాధ్యత అని చెప్పారు. బాలికలకు పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస నివారణ, బలవంతపు బాల్య వివాహాల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. అంతేకాక, డబ్ల్యూసీడీ, ఎస్.సీ విభాగం అందిస్తున్న సేవలను గురించి తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించదగిన ముఖ్యమైన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. 1098 (చైల్డ్ లైన్), 181 (మహిళా హెల్ప్‌లైన్), 100 (పోలీస్), 1930, 14567లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. డీహెచ్‌ఈ రామాదేవి, ఏడబ్ల్యూటీ అరుణ, హెచ్‌ఎం లింగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా. ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలను చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం భారతదేశానికి ప్రపంచ దేశాలలోనే పేరు తీసుకువచ్చారని, దేశ రక్షణ కోసం పృథ్వి, నాగ్ లాంటి క్షిపణులను తయారుచేసిన రూపశిల్పి, సైంటిస్ట్ అని కొనియాడారు. కలాంకు విద్యార్థులంటే చాలా ఇష్టమని, అందుకే ఆయన విద్యార్థులతో "కలలు కనండి, కలలను సాకారం చేసుకోండి" అని బోధించేవారని గుర్తుచేశారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఆయన చెప్పేవారన్నారు. విద్యార్థులు అబ్దుల్ కలాంని ఆదర్శంగా తీసుకుని దేశానికి సేవ చేయాలని ఆయన కోరారు. పాఠశాల డైరెక్టర్ పరిహీన్ అజ్మీ, ఉపాధ్యాయులు రమాదేవి, మానస, రేణుక, చందర్, విజయేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

- రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు సిద్ధం చేయాలని
- అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం



**వరంగల్ వాయిస్, మల్హర్/భూపాలపల్లి :** ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఓ, మార్కెటింగ్, తూనికలు కొలతల శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా కొనుగోళ్లు జరపడం చాలా కీలకమని తెలిపారు. నవంబర్ మొదటి వారం నుంచి జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా, ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. అవసరమైన పరికరాల కోసం ముందుగానే ఇండెంట్ ఇవ్వాలని, రవాణాలో సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అకాల వర్షాల కారణంగా నీరు నిలిచే ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అటువంటి ప్రాంతాలలో గత సంవత్సరం ఇబ్బందులు ఎదురైనందున, కొనుగోలు కేంద్రాలను మార్చాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన చెక్‌లిస్ట్ ప్రకారం నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. క్రాప్ బుకింగ్ చేయని పంటలకు వ్యవసాయ అధికారులు ధ్రువీకరణ ఇవ్వాలని తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, డీసీఓ వాల్య నాయక్, వ్యవసాయ అధికారి బాబురావు, డీఆర్‌డీఓ బాలకృష్ణ, తూనికలు కొలతలు శాఖ అధికారి శ్రీలత, రవాణా శాఖ అధికారి సంధాని తదితరులు పాల్గొన్నారు.

# బుగులోని జాతరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

## ◆ ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో స్వయంభుగా వెలసిన శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి వారి జాతర బ్రహ్మోత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే స్థానిక నాయకులు, అధికారులతో కలిసి జాతరలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఏర్పాట్లపై పరిశీలన చేసి మాట్లాడారు. బుగులోని వెంకటేశ్వర స్వామి వారు నియోజకవర్గ ప్రజలకు ఆరాధ్య దైవంగా ఉన్నారని అన్నారు. ప్రతి ఏటా నవంబర్ మాసంలో కార్తీక పౌర్ణమికి 5 రోజుల పాటు జరిగే శ్రీ బుగులోని జాతరకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారని, వారికి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ. 5.50 కోట్లతో జగ్గయ్యపేట నుంచి బుగులోని జాతర, తిరుమలగిరి నుంచి బుగులోని జాతర, పాండవుల గుట్ట నుంచి బుగులోని జాతర వరకు రోడ్డు నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ఫారెస్ట్ అధికారుల కారణంగా పాండవుల గుట్ట నుంచి జాతర రోడ్డు నిర్మాణానికి కొంత ఇబ్బందులు కలిగినప్పటికీ, త్వరలోనే ఆ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే, జాతరలో రూ. 2 కోట్లతో చేపట్టనున్న ఇతర అభివృద్ధి పనులను గురించి ప్రస్తావిస్తూ స్నానాల గుండం, మంచినీటి బావి, కొండపైకి మెట్ల వెడల్పు, భక్తులకు విశ్రాంతి గది, కళ్యాణ మండపం, కళ్యాణ కట్ట, మహిళల స్నానపు గదులు, మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా, స్తంభం చెట్టు చుట్టూ సీసీ, గండ దీపం పైకి 30 మీటర్ల మెట్లు వంటి అభివృద్ధి పనులు ఈ జాతర నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశించారు. జాతరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, ఎన్ఎస్ఆర్ సంస్థల అధినేత సంపత్ రావు, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, బుగులోని జాతర చైర్మన్ గంగుల రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

## ఐసీడీఎస్ సూపర్వైజర్ సునితాదేవి



**వరంగల్ వాయిస్, నర్మెట :** గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ జి.సునితాదేవి అన్నారు. మండలంలోని వెల్దండ గ్రామంలోని పీహెచ్‌సీలో పోషణ మాసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సునితాదేవి మాట్లాడుతూ తల్లులు, గర్భిణీలు, చిన్నారులు మనకు అందుబాటులో ఉన్న పాలు, గుడ్లు, ఆకుకూరలు, చేపలు, బెల్లం, పప్పులు, చిరుధాన్యాలు వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, పోషణ మహోత్సవంలో భాగంగా గర్భిణీలకు శ్రీమంతాలు (సీమంతాలు) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అమృత, అంగన్వాడీ టీచర్లు కుంటి రాంబాయి, మమత, మంజుల, విజయకుమారి, లీల, నాగమ్మ, ఉమ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

## వ్యవసాయ అధికారిణి శ్రీజ



**వరంగల్ వాయిస్, మల్లూర్ :** వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2025-26లో భాగంగా మల్లూర్ మండలంలోని మహిళా రైతులకు 50 శాతం రాయితీతో మొత్తం 131 వ్యవసాయ పనిముట్లను కేటాయించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారిణి శ్రీజ తెలిపారు. ఈ పథకం కింద మంజూరైన పరికరాలు రోటవేటర్లు: 5, కల్టివేటర్/కేజీ వీల్స్/డిస్క్ హారో: 7, బ్యాటరీ స్ప్రేయర్లు: 90, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు: 22, బ్రష్ కట్టర్లు: 2, వరి గట్లు వేసే మెషిన్: 1, విత్తనం, ఎరువులు వేసే మెషిన్: 1, పవర్ టిల్లర్: 1, వరి గడ్డి కట్టే మెషిన్: 2 ఉన్నాయి. దరఖాస్తుకు తుది గడువు అక్టోబర్ 22 ఆసక్తిగల మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారిణి శ్రీజ సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన పత్రాలు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ సంబంధిత పరికరాల కోసం ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్ కాపీ జతచేయాలన్నారు. మహిళా రైతులు ఈ పత్రాలతో ఈ నెల 22 లోపు సంబంధిత క్లస్టర్ ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళలపై జరుగుతున్న నేరాలు, అఘాయిత్యాల నియంత్రణలో అందరూ భాగస్వామ్యం కావాలని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతలను నిర్వర్తించాలని వరంగల్ షీ టీం కానిస్టేబుల్ కంచి. వంశీ కృష్ణ కోరారు. జాగ్రత్తతో మెలగడం ద్వారా మహిళలపై జరిగే నేరాలను అదుపు చేయవచ్చని ఆయన అన్నారు. షీ టీం వరంగల్ సీఐ కె.సుజాత ఆధ్వర్యంలో హనుమకొండలోని కాకతీయ జూనియర్ కాలేజీలో దాదాపు 200 మంది విద్యార్థినులతో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ కంచి. వంశీ కృష్ణ మాట్లాడుతూ అమ్మాయిలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, తెలియని ప్రదేశాలకు ఒంటరిగా ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు టీ-సేఫ్ యాప్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఉద్యోగాలు చేసే మహిళలు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని హెచ్చరించారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా వెంటనే షీ టీం వరంగల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలని సూచించారు. సీపీ గారి వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270 లలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి, నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి, వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, షీ టీం నుంచి ఎస్.ఐ. యాదగిరి, కానిస్టేబుల్ కే. వంశీ కృష్ణ, ఎండీ. ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని, అందుకే ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరుకుంటున్నారని, బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హనుమకొండలోని రాంనగర్‌లో ఉన్న తన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత, టీపీసీసీ గీత సెల్ సెక్రటరీ రావుల వెంకట రమేష్ గౌడ్ ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ ప్రెసిడెంట్ భూక్య సాంబయ్య నాయక్, 55వ డివిజన్ ప్రెసిడెంట్ అటికం రవీందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ ఎంపీపీ అప్పారావు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేరుతుంది

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పేద ప్రజల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తప్పక నెరవేరుతుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ భవాని నగర్‌లోని తన నివాసంలో 17వ డివిజన్ పరిధిలోని అర్హులైన 43 మంది లబ్ధిదారులకు ఆయన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, ఇందులో ప్రలోభాలకు, పైరవీలకు తావు లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని, లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు కూడా తీసుకోవచ్చని సూచించారు. గత ప్రభుత్వ పాలకుల నిర్వాకం వల్లే ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను అందుకున్న లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన కోరారు.

# 'రసం పీల్చే పురుగుల'పై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, దామెర :** మిర్చి పంటకు తీవ్ర నష్టం కలిగించే రసం పీల్చే పురుగుల నివారణ, యాజమాన్యంపై దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు జరిగింది. నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో, నటరాజ్ ఏజెన్సీస్ చల్లగరిగె సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో సుమారు 180 మంది రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా స్పందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కంపెనీ నూతన ఉత్పత్తులైన అటమోస్, సయనాట్ ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఉత్పత్తుల ఉపయోగాలు, సరైన వాడకం విధానం, పంటలపై వాటి సానుకూల ప్రభావం గురించి వివరంగా తెలియజేశారు. క్షేత్ర స్థాయిలో ఈ సయనాట్, అటమోస్ పనితీరును రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. సంస్థ ప్రతినిధులు శ్రీధర్ రోత్ల (ఆర్ఎంఎం), చరణ్ (ఏఎంఎం), విష్ణువర్ధన్ (టీబీఎం), నటరాజ్ ఏజెన్సీస్ ప్రొప్రైటర్ రాజు, వరంగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# ‘బీసీలకు 42% రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా కల్పించాలి’



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలో తక్షణమే కుల గణన చేపట్టాలని, బహుజనుల జనాభా ఆధారంగా చట్టసభలు, స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి కేంద్ర పాలకులపై ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొండలోని కాళోజీ నారాయణరావు సెంటర్‌లో బీసీ హక్కుల సాధన సమితి పిలుపులో భాగంగా సీపీఐ రాస్తారోకో నిర్వహించింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా జీవో 9 ద్వారా తీర్మానం చేసి గవర్నర్‌కు పంపినా, గవర్నర్ వివక్షతతో కేంద్రానికి పంపకుండా పెండింగ్‌లో పెట్టడం, ఆ తర్వాత హైకోర్టు స్టే ఇవ్వడం బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడమే అని మండిపడ్డారు. 1931 తర్వాత బీసీ జనగణన జరగకపోవడం వల్ల బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల్ కమిషన్ నివేదిక ప్రకారం 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం తీవ్ర అన్యాయమన్నారు.సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్ కేంద్ర పాలకుల బీసీ వ్యతిరేక విధానాలను నిరసించారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న బీసీ ఐక్య కార్యాచరణ జరిపే బంద్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తోట భిక్షపతి, మద్యలో ఎల్లేష్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తిని సదానందం, నేదునూరి రాజమౌళి, బుట్టి శ్యాంసుందర్ యాదవ్, డా. తిరునహరి శేషు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సొసైటీపై కార్మికుల ఆందోళన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** చేనేత సొసైటీ పాలకవర్గం, కమిటీ సభ్యుల నిర్లక్ష్యం కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని చేనేత కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కార్మికులకు 2 నెలల 15 రోజులుగా వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. కార్మికులకు సరైన కూలి రేట్లు ఇవ్వడం లేదు, అలాగే స్పెషల్ వేజెస్ కూడా చెల్లించడం లేదని తెలిపారు. చేనేత కార్మికులకు సరియైన పని కల్పించడం లేదు. చేనేత సొసైటీకి ఎన్నికలు జరిగి దాదాపు 12 సంవత్సరాలు అవుతున్నా, పాలకవర్గం సరిగా పనిచేయడం లేదని కార్మికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సొసైటీపై స్పెషల్ అధికారిని నియమించి, కార్మికులకు పని కల్పించాలని కోరారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవం



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని పులుకుర్తి గ్రామంలోని రైతు వేదికలో బుధవారం అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళా రైతులను సన్మానించారు. అలాగే, వారికి పెరటి తోటల్లో కూరగాయల పెంపకం, సేంద్రియ వ్యవసాయం గురించి నిపుణులు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఈ.రాంబాబు, నరేందర్, గోపిక, శ్రీనివాస్ నాయక్, మహిళా రైతులు, ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

## పోషకాహారంపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మల్హర్ మండలంలోని గాదంపల్లె గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాలికలకు పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు (సీమంతం), చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రాధిక, ఎస్వో భవానీ, గంగారాం సెక్టార్ సూపర్వైజర్ వీణ, ఎన్జీవో సమ్మయ్య, పోషణ అభియాన్ స్వప్న, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్‌లు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## ఆచార్య రాజేందర్ కట్లకు జాతీయ గౌరవం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు ఆచార్య రాజేందర్ కట్ల, ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ (ఐఏఏ) జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఒక సంవత్సరం కాలానికి ఎన్నికయ్యారు. రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ నగరంలో అక్టోబర్ 12 – 13, 2025 తేదీలలో జరిగిన ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆచార్య రాజేందర్ తెలిపారు. ప్రస్తుతం ఆచార్య రాజేందర్ ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్, వరంగల్ చాప్టర్ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## నరకాసుర వధ ఉత్సవంలో పాల్గొంటా

### ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 19న ఉర్సు గుట్ట వద్ద జరగనున్న నరకాసుర వధ ఉత్సవ కార్యక్రమంలో తాను పాల్గొంటానని వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య తెలిపారు. బుధవారం ఆమె హనుమకొండలోని నివాస గృహంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్లి రవి ఆధ్వర్యంలో ఎంపీ కడియం కావ్యకి పూల మొక్కను, ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్లి రవి మాట్లాడుతూ 58 అడుగుల ఎత్తుతో తయారు చేసిన నరకాసుర విగ్రహానికి బాంబులు అమర్చి పేల్చివేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, వేలాది మంది ప్రజలు పాల్గొంటారని ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరుపల్లి గౌతం, ఆవునూరి రామ్మూర్తి, దూడ బాల కొమురెల్లి, వనం మధు, శెట్టి మోహన్, ఆవునూరు ఐలేశం, మరుపల్ల శివ, కాటం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బొట్ల రాకేష్ ఆశయాలను కొనసాగిద్దాం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** పది రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) వరంగల్ డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేష్ ఆశయాలను కొనసాగించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం సదానందం, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరు మండలం గూడెప్పాడు గ్రామంలో మాస్ లైన్ వరంగల్ డివిజన్ సహాయ కార్యదర్శి అర్షం అశోక్ అధ్యక్షతన కామ్రేడ్ బొట్ల రాకేష్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బొట్ల రాకేష్ విద్యార్థి దశ నుంచే విప్లవోద్యమంలో భాగస్వామ్యమై, నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేశారు. 13 సంవత్సరాలు రహస్య దళాల్లో పనిచేసి ములుగు, భూపాలపల్లి, ఆత్మకూరు, వరంగల్ ప్రాంతాల్లో విప్లవ చైతన్యాన్ని రగిలించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ముంజల భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు బరుపట్ల కిరీటి, డీబీఎస్ఎఫ్ నాయకులు రాము, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నర్సింహరావు తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ జేఏసీ జిల్లా కమిటీ నియామకం

### చైర్మన్‌గా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**వరంగల్ వాయిస్, హన్మకొండ :** బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీని బుధవారం హన్మకొండ నయీం నగర్‌లో ఎన్నుకున్నారు. బీసీ జేఏసీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నూతన కమిటీని ప్రకటించారు. చైర్మన్ గా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, వర్కింగ్ చైర్మన్ దొడ్డపల్లి రఘుపతి, వైస్ చైర్మన్‌లుగా దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, వైద్యం రాజగోపాల్, తమ్మెలా శోభారాణి, కోఆర్డినేటర్లుగా తంగళ్లపెల్లి రమేష్, గాజు యుగేందర్ యాదవ్ లు ఎన్నికయ్యారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై విద్య సంస్థలు, వ్యాపార వాణిజ్య సంస్థలు, బస్సులు, ప్రైవేట్ వాహనాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని తమ సహకారాన్ని అందించాలని ఆయన ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.

## ముగ్గురు పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ హంటర్ రోడ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠానికి చెందిన ముగ్గురు పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్ ప్రకటించినట్లు పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టరేట్ పొందిన విద్యార్థులు కూన వెంకట రామకృష్ణ కళింగాంధ్ర కళారూపాలు – ఒక పరిశీలన (పర్యవేక్షణ: ఆచార్య నాగపట్ల భక్తవత్సలరెడ్డి), రాజేశ్వరీ దుండె తెలంగాణ ప్రాంత పెరిక కుల సంస్కృతి, సంప్రదాయాలు – అధ్యయనం (పర్యవేక్షణ: ఆచార్య భట్టు రమేష్), మహేశ్వరరావు చందా: కోయ గిరిజనుల పటం కథలు – అధ్యయనం (పర్యవేక్షణ: ఆచార్య భట్టు రమేష్)లు సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాలకు తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది.

## రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**వరంగల్ వాయిస్, సుబేదారి :** పూలే విదేశీ విద్యా జ్యోతి పథకం కింద ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపే విద్యార్థుల సంఖ్యను ప్రతి సంవత్సరం 300 నుంచి 700కి పెంచినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కృతజ్ఞతలు తెలియజేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దారబోయిన సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ శేషు బీసీ నాయకులు నేదునూరి రాజమౌళి, మరో బీసీ నాయకులు బుట్టి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ, అక్టోబర్ 18న జరగబోయే ‘బంద్ ఫర్ జస్టిస్’ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు సోమిడీ అంజన్ రావు, తెలంగాణ కొమరయ్య, చాపర్తి కుమారస్వామి, చిన్నాల యశ్వంత్ యాదవ్, డేనియల్, కేడల ప్రసాద్, పాల రవి, ఐతం నగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# సాయిదుర్గా తేజ్ .. సంబరాల ఏటిగట్టు

### బర్త్‌డే విషెస్‌గా ఫస్ట్ గ్లింప్స్ విడుదల

సాయిదుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎస్.వై.జి' (సంబరాల ఏటిగట్టు). ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్.కె.పి దర్శకత్వం వహిస్తున్నారు. సాయి దుర్గాతేజ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'అసుర సంధ్యవేళ మొదలైంది.. రాక్షసుల ఆగమనం..' అంటూ సాయి దుర్గాతేజ్ పవర్‌ఫుల్ డైలాగుతో ఆకట్టుకున్నారు. 'విరూపాక్ష' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత టాలీవుడ్ హీరో సాయిదుర్గతేజ్ శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ఈ సినిమాకు రోహిత్ కె.పి దర్శకత్వం వహిస్తుండగా.. ప్రైమ్ షో ఎంటర్‌టైనమెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.సాయి ధరమ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి అతడికి బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. ఫస్ట్ గ్లింప్స్‌ను వదిలారు. సాయి తేజ్ ఇందులో బాలీ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. 125కోట్ల భారీ బ్జడెట్ తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఐశ్వర్యలక్ష్మీ కథానాయికగా నటిస్తుండగా. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# పెళ్లికి ముందే తెలుసు

### టీవీ షోలో పెళ్లి చేసుకున్న అవికాపై విమర్శలు

చిన్నారి పెళ్లికూతురు'గా విశేష గుర్తింపుపొందిన నటి అవికా గోర్ ఇటీవలే తన ప్రియుడు మిళింద్ చద్వానీని పెళ్లాడిన విషయం తెలిసిందే. అయితే, ఆమె ఓ టీవీ రియాలిటీ షోలో పెళ్లి చేసుకోవడంతో పలు విమర్శలు ఎదురయ్యాయి. ఆమె వెడ్డింగ్ లుక్‌పై కూడా నెట్టింట ట్రోల్స్ వచ్చాయి. తాజాగా దీనిపై ఈ జంట ఘాటుగా స్పందించింది. టీవీ కార్యక్రమంలో పెళ్లి చేసుకోవాలనేది తనకు చిన్నప్పటి కోరిక అని అవికా అన్నారు. తన నిర్ణయం సరైనదేనని చెప్పారు. టీవీ కార్యక్రమంలో పెళ్లి చేసుకోవాలనే నిర్ణయాన్ని మిళింద్‌కు తెలిపినప్పుడు తను అంగీకరించాడు. ప్రజలు విమర్శిస్తారని ముందే చెప్పాడు. డబ్బు కోసమే అలా చేస్తున్నామని విమర్శలు వస్తాయని తెలిపాడు. కానీ, నా నిర్ణయంపై మేమిద్దరం సంతోషంగానే ఉన్నాం. మిళింద్ అంగీకరించడమే నాకు ముఖ్యం. ప్రజల గురించి పట్టించుకోను. ఇక నా పెళ్లి తంతు మొత్తం సంప్రదాయంగా జరిగింది. అందుకే కొందరు నా వెడ్డింగ్ లుక్‌పై ట్రోల్స్ చేస్తున్నారు. ఒకవేళ ఈ ట్రోల్స్ నా భర్త లుక్స్‌పై వచ్చిఉంటే నేను బాధపడేదాన్ని.. ఎందుకంటే ఆయన లుక్‌ను నేను డిజైన్ చేశాను. అలా రానందుకు ఆనందంగా ఉందని అవికా అన్నారు. ఇక టీవీ కార్యక్రమంలో పెళ్లి చేసుకోవడంపై వచ్చిన విమర్శలను ఉద్దేశిస్తూ.. అవికా భర్త మిళింద్ మాట్లాడారు. ఈరోజుల్లో కనీసం 50 మంది ఫొటోగ్రాఫర్లు, వీడియో రికార్డు చేసేవారు లేకుండా ఏ పెళ్లి జరగడం లేదన్నారు. అందరి పెళ్లిళ్లలో ఇలాంటివి కామన్ అన్నారు. అవికా మంచి ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇక ఓ హిందీ రియాలిటీ షోలో సెప్టెంబర్ 30న వీరి వివాహం జరిగిన విషయం తెలిసిందే.



# మహాభారత్ కర్ణుడు పంకజ్ ధీరజ్ మృతి

ప్రముఖ దర్శక, నిర్మాత బి.ఆర్. చోప్రా తెరకెక్కించిన బుల్లితెర ధారావాహిక 'మహాభారత్'లో కర్ణుడి పాత్రను పోషించిన పంకజ్ ధీర్ (68) కాన్సర్ తో బుధవారం కన్నుమూశారు. భారతీయ టెలివిజన్ రంగంలో పంకజ్ ధీర్ కు మంచి గుర్తింపు ఉంది. 'మహాభారత్' సీరియల్ లో కర్ణుడి పాత్రతో ప్రతి ఒక్కరికీ చేరువైన పంకజ్ 'మహా భారత్' తర్వాత 'చంద్రకాంత, ది గ్రేట్ మరాఠా, యుగ్, బధో బాహు'లో నటించారు. అలానే హిందీ చిత్రాలు 'సడక్, సోల్జర్, బాద్ షా' లో యాక్ట్ చేశారు. నటుడిగానే కాకుండా సినిమా రంగంలో ఎంటర్ పెన్యూర్ గానూ తన సత్తా చాటే ప్రయత్నం చేశారు పంకజ్ ధీర్. 2006లో ముంబైలోని జోగేశ్వరి లో తన సోదరుడు సట్లుజ్ ధీర్ తో కలిసి విశగే స్టూడియోజ్ ను ఏర్పాటు చేశారు. అలానే 2010లో మహాభారత్ లోని తన తోటి నటుడు గుఫీ పెయింటర్ తో కలిసి అభినయ్ యాక్టింగ్ అకాడమిని ప్రారంభించారు. పంకజ్ ధీర్ కుమారుడు నికితిన్ ధీర్ కూడా నటుడే కావడం విశేషం. అతను 'చెన్నయ్ ఎక్స్ ప్రెస్, షేర్షా ' వంటి చిత్రాలలో నటించాడు. టీవీ నటి క్రతికా సెంగర్ ను వివాహం చేసుకున్నాడు.







# శర్వానంద్‌తో శ్రీను వైట్ల తదుపరి మూవీ

శ్రీను వైట్ల ఒకప్పుడు తెలుగులో క్రేజీయెస్ట్ డైరెక్టర్. యువ కథానాయకులతోనే కాదు స్టార్ హీరోలతోనూ సినిమాలు చేసి తన సత్తాను చాటుకున్నారు. శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలు బ్లాక్ బస్టర్ సక్సెస్ ను అందుకున్నాయి. అయితే... 2011లో వచ్చిన 'దూకుడు' తర్వాత మళ్ళీ శ్రీను వైట్ల ఆ స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు. అంతేకాదు... 2018లో వచ్చిన 'అమర్ అక్బర్ ఆంథోని' సినిమా తర్వాత ఆయన ఏకంగా ఐదేళ్ళు దర్శకత్వానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇక గత యేడాది 'విశ్వం' సినిమాతో మళ్ళీ లైమ్ లైట్ లోకి వచ్చిన శ్రీను వైట్ల... ఆ తర్వాత ఎట్టకేలకు ఓ ప్రాజెక్ట్ ను సెట్ చేయగలిగాడు. 'ఢీ' సినిమా తర్వాత దానికి సీక్వెల్ గా మంచు విష్ణుతోనే శ్రీను వైట్ల సినిమా చేస్తాడనే ప్రకటన వచ్చింది. కానీ అది పట్టాలెక్కలేదు. ఈ లోగా గోపీచంద్ హీరోగా 'విశ్వం' సినిమాను శ్రీను వైట్ల తెరకెక్కించాడు. ఇది థియేటర్లలో పెద్దంత ఆడకపోయినా... ఓటీటీలో బాగానే వీక్షకులను మెప్పించింది. అప్పటి నుండి మరో సినిమాను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడు. ఆ మధ్య నితిన్ హీరోగా శ్రీను వైట్ల ఓ సినిమా చేయబోతున్నాడనే ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు శర్వానంద్ తో శ్రీను వైట్ల ప్రాజెక్ట్ లాక్ అయ్యిందని తెలుస్తోంది. 'విశ్వం'కు రచన చేసిన నందు ఈ సినిమాకూ వర్క్ చేస్తున్నాడని అంటున్నారు. శ్రీను వైట్ల చెప్పిన కథ నచ్చడంతో శర్వానంద్ ఈ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. దాంతో మిగిలిన నటీనటులు, టెక్నీషియన్స్ ను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అతి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తుందని, వచ్చే యేడాది ప్రారంభంలో ఇది సెట్స్ పైకి వెళుతుందని అంటున్నారు. మరి శర్వా `శ్రీను వైట్ల తొలి కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమాతో మరోసారి వీరిద్దరూ సక్సెస్ ట్రాక్ ఎక్కుతారేమో చూడాలి.





# ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని కాపాడండి

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించండి
- ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మార్చి 2024 నుంచి ఇప్పటివరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించి ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని కాపాడాలని రిటైర్మెంట్ బకాయిల సాధన కమిటీ పేర్కొంది. ఉద్యోగ విరమణ పొంది సంవత్సరంన్నర కాలం గడిచినప్పటికీ పెన్షన్ తప్ప తమకు రావాల్సిన జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ, జీఐఎస్, లీవ్ ఇన్ క్యాస్మెంట్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ, పీఆర్సీ ఏరియర్స్, డీఏ ఏరియర్స్ మొదలగు ఎలాంటి ప్రయోజనాలు అందక మానసిక క్షోభకు గురి కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది మనోవేదనతో అసువులు బాశారన్నారు. బకాయిల సాధన కమిటీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం పాలక పక్షం ప్రజా ప్రతినిధులైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని కలిసి తమకు రావాల్సిన బెనెఫిట్స్ ఇప్పించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు శ్రీదర్ల ధర్మేంద్ర, ప్రధాన కార్యదర్శి కదారి భోగేశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కందుకూరి దేవదాసు, ఎండి. అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ రాక పిల్లల వివాహాలు చేయలేక, ఇల్లు కట్టుకోలేక, పిల్లల చదువుల కోసం చేసిన అప్పులు, ఈఎంఐలు చెల్లించలేక, అప్పులు కట్టలేక మానసిక వేదనతో అనేక రోగాల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నెల నెల వేల మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నందున బకాయిలు పెరిగి పోయే ప్రమాదం ఉన్నదని వెల్లడించారు. ఈ విషయాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు మేకిరి దామోదర్, ఆర్వీ చలం, పి.అశోక్ కుమార్, సభ్యులు శ్యామ్ రావు, బి.సారయ్య, రాజేందర్, డాక్టర్ బి.కృష్ణ మూర్తి, బి.వెంకటేశ్వర్లు, ఎస్.శ్యామ్ సుందర్ రెడ్డి, ఎం.సంజీవ రెడ్డి, గణపతి, ఐత రవీందర్ తదితరులు 30 మంది పాల్గొన్నారు.













# పాత కక్షలతో దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామం పరిధిలో చందా సుధాకర్ పై పాత కక్షలతో అదే గ్రామానికి చెందిన పలువురు ఈ నెల 14వ తేదీన దాడి చేయడంతో తీవ్రంగా గాయాలపాలయ్యారు. దీంతో చందా సుధాకర్ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన చందా ప్రశాంత్, అతని కుటుంబ సభ్యులు చందా విజయ, ఆకుతోట జ్యోతి, ఆకుతోట పూర్ణ చందర్, చింతపట్ల రాజు, చింతపట్ల కిట్టులపై కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో బుధవారం ప్రగతి సింగారం గ్రామం వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా పోలీస్ వారిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకొన్న శాయంపేట ఎస్సై పరమేష్ పరకాల కోర్ట్ లో హాజరు పరిచి రిమాండ్ కు తరలించారు.




# రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి

## బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగాని మల్లేశ్వర్

**వరంగల్ వాయిస్, కేయూ :** బీసీ రిజర్వేషన్ల అమలు కోరుతూ ఈ నెల 18న తలపెట్టిన బంద్ ను విజయవంతం చేయాలని పూలే ఆశయ సాధన సమితి పాస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కాకతీయ విశ్వవిద్యాలయం పూలే ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ ఈ నెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్ లో సబ్బండ వర్గాలు పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చి రిజర్వేషన్ అమలుకు సానుకూలంగా స్పందిస్తారన్నారు. ఈ బంద్ లో రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు, కుల సంఘాలు పాల్గొని ఐక్యత చాటినప్పుడే రిజర్వేషన్ వ్యతిరేకుల్లో వణుకు పుడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, పాస్ జిల్లా ఉపాధ్యక్షులు మెరుగు బాబు యాదవ్, పాస్ నాయకులు బోళ్ల వీర ప్రతాప్, డాక్టర్ వంగల సుధాకర్, నీలం ప్రనూప్ పాల్గొన్నారు.



# ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో రోడ్ల నిర్మాణం

- సమగ్ర ప్రణాళిక రూపొందించండి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బాలసముద్రంలో బల్దియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెహికల్ షెడ్ లో గల ట్రాన్స్ఫర్ స్టేషన్ లో రహదారుల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రాన్స్ఫర్ స్టేషన్ లో వెహికల్ వెయిటింగ్ కు ఎంత సమయం అవుతుందని, స్వచ్ఛ ఆటో ఒక ట్రిప్పు చెత్తను యంత్రంలోకి వేయడానికి ఎంత సమయం తీసుకుంటుందని ప్రతిరోజు ఒక క్యాంపాక్టర్, ఒక టిప్పర్ ఎన్ని ట్రిప్పులు వేస్తుందని, రికార్డ్స్ పక్కాగా నిర్వహించాలని చెత్త వాహనాలకు చెందిన వాస్తవ సమాచారం నమోదు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. డిస్పోజల్ సమయం సరిగా ఉందా లేదా అని కమిషనర్ ఎంక్వైరీ చేశారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ ట్రాన్స్ఫర్ స్టేషన్ లో అంతర్గత రహదారులు సరిగా లేవని ఏ విధంగా రోడ్లు ఏర్పాటు చేయవచ్చు అనే అంశానికి అభివృద్ధి పనులకు చెందిన రోడ్లు పార్కింగ్ సంబంధిత సమగ్ర అంశాలతో ప్లాన్ తయారు చేయాలని వాషింగ్ ఏరియా పరిశుభ్రంగా ఉండాలని వాష్ ఏరియా బయటి వైపు ఉండేలా చూడాలని లీచేట్ వెళ్లిపోవడానికి డ్రైనేజీ ఏర్పాటు ఉండాలన్నారు. కొత్త వాహనాలు వచ్చినప్పుడు రెగ్యులర్ గా వాటికి నిర్వహించే పీరియాడిక్ సర్వీసింగ్ జరగాలని వాహనాల రిపేరింగ్ లు తగ్గించే విధంగా వాహనాలు సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. పెట్రోల్, డీజిల్ ఆటోలలో ఏ ఆటోల నిర్వహణ సులభం అని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్ఫర్ స్టేషన్ డంప్ యార్డు లాగా కాకుండా పరిశుభ్రంగా ఉండాలని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈలు మహేందర్, రవి కుమార్, డీఈలు రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్, ఏఈలు ఫణి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com